మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 84 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

బుధవారం 19 జూన్ 2024




## 'పీఎం కిసాన్' నిధులు వచ్చేశాయి

# ఐటీఐలను ఆధునీకరిస్తాం

- ఉద్యోగ,ఉపాధి అంశాలే కీలకం
- ఇకపై వీటిని ఏటీసీలుగా మారుస్తున్నాం
- ఆధునిక శిక్షణతో యువతకు ఉపాధి కల్పిస్తాం
- టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకు ఒప్పందం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మల్లేపల్లి ఐటీఐ అధునీకరణ కేంద్రానికి శంకుస్థాపన



హైదరాబాద్, (ప్రజా మంటలు):
మల్లేపల్లి ఐటీఐలో ఏటీసీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధి అంశాలే కీలకంగా మారాయి. నిరుద్యోగ యువతకు చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో ఐటీఐలను ప్రక్షాళన చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు వాటిని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలనే నిర్ణయించాం. రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులున్నారు. వారి విలువైన కాలాన్ని వృథా చేయకూడదనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టాం. నేను ఇల్లు కట్టుకునే సమయంలో ఇంజినీరింగ్ గ్రాడుయేట్స్ వచ్చి రూ.15 వేలు, రూ.20 వేలకు పనిచేస్తామని వచ్చారు. అదే మేస్త్రీలు, నిర్మాణ రంగంలో అనుభవం ఉన్నవారిని సంప్రదిస్తే రూ.60 వేలు అడిగారు.సర్టిఫికెట్లు జీవన ప్రమాణాలను పెంచడం లేదని అప్పుడే అర్థమైంది. అందుకే ఎంతోమంది గల్ఫ్ దేశాలకు మిగతా 2లో..

## నీట్ ఆందోళనలపై ప్రధాని మౌనమెందుకు?

కాంగ్రెస్ ఎంపీ రాహుల్




## మాతో టచ్‌లో ఎన్డీయే నేతలు

- రాహుల్

## ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉత్తర కొరియా మద్దతుగా నిలుస్తోంది




## ఎన్టీఏ పై సుప్రీం ఆగ్రహం

- ఏ కొంచెం తప్పు జరిగినా చర్యలకు వెనకాడరాదు
- విద్యార్థుల ఆందోళనలపై స్పందించాలి
- జాతీయ పరీక్ష మండలిపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):
వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ, అవకతవకలు జరిగాయంటూ వస్తోన్న వార్తలతో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో వీటిని నిర్వహిస్తోన్న జాతీయ పరీక్ష మండలిపై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మండిపడింది. ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా.. మిగతా 2లో..



## విద్యుత్ కుంభకోణ సూత్రధారులను శిక్షించాల్సిందే..

- ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంతో రూ. 2,600 కోట్ల నష్టం
- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట కోదండరామ్ ,విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు వెల్లడి
- తప్పులను సమర్థించుకుంటున్న కేసీఆర్
- విద్యుత్ కొనుగోళ్లో అక్రమాలను సమర్థించుకునే యత్నం
- కమిషన్ ఎదుట వివరణ ఇచ్చిన ఇరువురు



హైదరాబాద్, (ప్రజా మంటలు):
చత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందాల వల్ల 2,600 కోట్ల రూపాయల నష్టం జరిగిందని విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు తెలిపారు. మంగళవారం జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్టు చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాలపై తమ వద్ద ఉన్న సమచారాన్ని కూడా అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌తో తొలుత వెయ్యి మెగావాట్ల సరఫరాకు ఒప్పందం జరిగితే అది సప్లయ్ కాలేదని, తర్వాత తెలుసుకొని మరో వెయ్యి మెగావాట్లకు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. తరువాత తెలుసుకొని రద్దు చేసుకోవాలని ప్రయత్నిస్తే కుదరలేదన్నారు. చత్తస్ గఢ్ ఒప్పందం రెగ్యులేటరీ కమిషన్ ఒప్పదం పొందలేదని చెప్పారు. ఇరు రాష్ట్రాల డిస్కంలు మాత్రమే ఎంవోయూ చేసుకున్నాయని చెప్పారు. బీహెచ్‌ఈఎల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ లో 2013-2014 88శాతం ఉంటే తర్వాత జీరోకు పడిపోయిందని చెప్పారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన యాదాద్రి ప్లాంట్ తొమ్మిదేండ్లయినా పూర్తి కాలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీహెచ్‌ఈఎల్ సబ్ క్రిటికల్ టెక్నాలజీని రుద్దిందని చెప్పారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ కోసం వాడిన యంత్రాలు సరైనవి కావదని అన్నారు. గోదావరిలో ఫ్లడ్ ఎక్కువైతే పవర్ ఎ÷-లాంట్ పై ప్రభావం పడుతుందని చెప్పారు. సాంకేతిక పరమైన అంశాలను పరిగణనలోకి మిగతా 2లో..

## టీజీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూహెచ్‌లో ఉన్నత విద్యాశాఖ అధికారులు ఈ ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20,626 మంది విద్యార్థులు రాయగా.. పరీక్ష నిర్వహించిన నాలుగు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం విశేషం.



## ప్రజా నాడి





## బక్రా నదిపై కుప్పకూలిన బ్రిడ్జి

- బీహార్‌లో పేకమేడల్లా కూలుతున్న వంతెనలు
- ప్రారంభానికి ముందే కుప్పకూలిన వంతెన
- రూ.కోట్ల ప్రజాధనం నీటిపాలు
- నాణ్యత లోపమే అని మండిపడుతున్న స్థానికులు



పాట్నా (ప్రజా మంటలు):
రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలిన ఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. అయితే, ఇందులో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు.కూలిన ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమల్లో వైరల్‌గా మారాయి. నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోందంటూ స్థానికులు మండిపడుతున్నారు. బిహార్‌లోని అరారియా జిల్లాలోని బక్రా నదిపై ఓ వంతనెన నిర్మించారు. కుస్రా కాంతా-కిస్రీ ప్రాంతాలను కలిపే ఈ వంతెన పదరియా ఘాట్ సమీపంలో ఉంది. మంగళవారం ఉదయం భారీ శబ్దంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే అక్కడకు చేరుకున్న అధికారులు.. తొలుత మూడు పిల్లర్లు కూలిపోయినట్లు గుర్తించారు. పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.జిల్లా గ్రామీణ పనుల విభాగం ఆధ్వర్యంలో ఈ వంతెన నిర్మాణం జరిగింది. ఇందుకోసం దాదాపు రూ.12కోట్లు ఖర్చుపెట్టినట్లు అంచనా. బ్రిడ్జి పూర్తైనప్పటికీ.. ఇరువైపుల అప్రోచ్ రోడ్డు పనులు మిగిలి ఉండటంతో ప్రారంభించలేదని సమాచారం. అయితే, నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం వల్లే ఇది కుప్పకూలిందని స్థానిక ఎమ్మెల్యే విజయ్ మండల్ ఆరోపించారు. ఇదిలాఉంటే, మిగతా 2లో..

## ప్రజా నాడి



మొదటి పేజీ తరువాయి

# ఐటీఐలను ఆధునీకరిస్తాం

ఉపాధి కోసం వెళ్తున్నారు. ఇక్కడే అలాంటి ఉపాధి అవకాశాలు కల్పించి ఎవరూ విదేశాలకు వెళ్లకుండా చేస్తాం. రోబోలు మొదలుకొని అత్యాధునిక యంత్రాలు తీసుకొచ్చి యువతకు శిక్షణ అందించాలని భావిస్తున్నాం. ఈ ప్రయత్నంలో తోడ్పడేందుకు ముందుకొచ్చిన టాటా సంస్థకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్రం నలుమూలలా 65 ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని త్వరలోనే చేపడతాం. ముఖ్యమంత్రిగా నేను ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారిస్తా. ప్రతి నెలా సమీక్ష చేస్తా" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునికీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం రూ.2,324.21 కోట్ల నిధులు ఖర్చుచేయనుంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ అప్‌గ్రేడ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చనుంది. ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా వాటిలో యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. అందుకోసం అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏటీసీల్లో శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను నియమించింది. ఏటా 15, 860 మందికి 6 రకాల కోర్సుల్లో లాంగ్‌టర్మ్ కోచింగ్ లభించనుంది. అలాగే 31,200 మందికి 23 రకాల కోర్సుల్లో షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వనుంది. ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు కాగా.. టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు. ఏటీసీల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగాలు కల్పించనుంది.

**ఐటిఐలలో ఇక ఆధునిక శిక్షణ**

ప్రస్తుతం ఐటీఐల్లో విద్యార్థులకు నేర్పించే నైపుణ్యాలు ఉపయోగం లేకుండా పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. 50 ఏళ్ల నాటి నైపుణ్యాలను ఐటీఐల్లో నేర్పిస్తున్నారని, అప్ గ్రేడ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని ప్రకటించారు. ఇందుకోసం టాటా సంస్థ సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. విద్యార్థులు, నిరుద్యోగులను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని వివరించారు. తన ఆలోచనల నుంచి వచ్చిందే ఏటీసీ సెంటర్స్ అని పేర్కొన్నారు. మేం పాలకులు, మీరు బానిసలు అనే ఆలోచన లేదు. మేం సేవకులం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 40




లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక రిక్రూట్‌మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారు. సర్టిఫికెట్ ఉంటే సరిపోదు సాంకేతిక నైపుణ్యం ఉండాలి. సాంకేతిక నైపుణ్యం ఉంటే ఉపాధి లభిస్తుందని విశ్వసిస్తానని అన్నారు. సర్టిఫికెట్స్ జీవన ప్రమాణాలు పెంచవు. గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి గ్యారంటీ ఇస్తుంది. టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల కోసం రూ.2,324 కోట్లతో 65 ఐటీఐలు ఐటీసీలుగా మారుస్తున్నాం. విద్యార్థుల శిక్షణ కోసం ముందుకు వచ్చిన టాటా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఐటీ రంగంలో ప్రపంచంలో తెలుగు వారు పోటీ పడుతున్నారు. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడమే మా బాధ్యతని అన్నారు. రాష్ట్రంలో గల 65 ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దుతాం. నైపుణ్యాలను నేర్పించి నిరుద్యోగులకు భరోసా కల్పిస్తాం. విద్యార్థిని విద్యార్థులు ఐటీఐల్లో చేరాలి. ఈ శాఖ తన వద్ద ఉంటుంది. నేనే స్వయంగా పర్యవేక్షిస్తా. ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా అని' సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఐటీఐ స్కిల్ డెవలప్‌మెంట్ అప్ గ్రేడేషన్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టాటా టెక్నాలజీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుంది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74). ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయని అధికారులు తెలిపారు.



## సిఎంతో కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ సిఇవో భేటీ

(ప్రజా మంటలు):

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించినట్లు సమాచారం,. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల ప్రోత్సాహానికి పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉత్తర కొరియా మద్దతుగా నిలుస్తోంది

**– కలసికట్టుగా అమెరికాను ఎదుర్కొంటాం**

**– కిమ్‌తో భేటీకి ముందు పుతిన్ వాఖ్యలు**

సియోల్ (ప్రజా మంటలు):

ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉత్తర కొరియా తమకు మద్దతుగా నిలుస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. అందుకు ఆ దేశ అధినేత కిమ్ జోంగ్ ఉన్‌ను ప్రశంసించారు. ఈ మేరకు ఆయన 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ'కి వ్యాసం రాశారు. పుతిన్ మంగళ, బుధవారాలలో ఉత్తర కొరియాలో పర్యటించనున్నారు. అనేక విషయాల్లో ఇరు దేశాలు పరస్పర సహకారంతో ముందుకెళ్తున్నాయని పుతిన్ వెల్లడించారు. అందుకు ఐరాసలో అనుసరిస్తున్న ఉమ్మడి వైఖరిని ఉదహరించారు. తాజా పర్యటనతో ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత ఉన్నతస్థాయికి చేరుతుందని ఆకాంక్షించారు. అమెరికా విధించిన ఆంక్షలను కలిసికట్టుగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాల ప్రభావం పడకుండా చెల్లింపుల వ్యవస్థలను సైతం అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పర్యటకం, సంస్కృతి, విద్య రంగాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ పర్యటనలో ఇరు దేశాధినేతలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉందని రష్యన్ ఏజెన్సీలు వెల్లడించాయి. భద్రత, రక్షణకు సంబంధించిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం' కూడా అందులో ఒకటని పేర్కొన్నాయి. ప్రధానంగా రక్షణపరమైన సహకారంపైనే ఇరు దేశాల ఒప్పందాలు ఉండనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అణ్వాయుధాల అభివృద్ధి నేపథ్యంలో ఉత్తర కొరియాపై, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యాపై అమెరికా కఠిన ఆర్థికపరమైన ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా ఆయుధాలు సరఫరా చేస్తోందని పాశ్చాత్య దేశాలు భగ్గుమంటున్న విషయం తెలిసిందే. బాంబులు, క్షిపణులు సహా ఇతర సైనిక వ్యవస్థలను అందజేస్తోందని తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. తద్వారా యుద్ధం సుదీర్ఘంగా కొనసాగేలా చేస్తోందని ఆరోపించాయి. ఈ వాదనలను ఇటు రష్యా, అటు ఉత్తర కొరియా ఖండిస్తూ వచ్చాయి. ఈ నేపథ్యంలో పుతిన్ తాజా పర్యటన, ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పుతిన్ ఉత్తర కొరియా రావడం 24 ఏళ్లలో ఇదే మొదటిసారి. 2000 సంవత్సరం జులైలో పుతిన్ మొదటిసారి ఉత్తర కొరియా వెళ్లి, నాటి అధ్యక్షుడైన కిమ్ తండ్రితో సమావేశమయ్యారు. అమెరికా నుంచి సవాళ్లు పెరుగుతున్నందున, వాటిని ఎదుర్కోవడానికి సైనిక సహకారాన్ని వృద్ధి చేసుకోవాలని రష్యా, ఉత్తర కొరియాలు భావిస్తున్నాయి. ఈ విషయమై పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌లు చర్చలు జరుపుతారు. పుతిన్ పర్యటనపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఇరు దేశాలధినేతలు సమావేశం కావడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. కానీ, వారి మధ్య బలపడుతున్న బంధమే ఆందోళన కలిగిస్తోందని అగ్రరాజ్య భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ అన్నారు. ఇది కొరియా ద్వీపకల్పం సహా ప్రాంతీయంగా తీవ్ర అస్థిర పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

## ఎన్టీఏ పై సుప్రీం ఆగ్రహం

దాన్ని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహిస్తున్న సంస్థగా.. న్యాయంగా వ్యవహరించాలి. ఏదైనా తప్పిదం జరిగితే.. తప్పు జరిగిందని అంగీకరించాలి. ఈ చర్యలు తీసుకోనున్నాం అని వివరించాలి. కనీసం అదైనా మీ పనితీరుపై విశ్వాసం కలిగిస్తుందని ఎన్టీఏకు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశంలోనే అత్యంత కఠినమైన పరీక్షకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులు పడే శ్రమను మరిచిపోకూడదని తెలిపింది. వ్యవస్థను మోసం చేసే వ్యక్తి వైద్యుడైతే.. సమాజానికి ఎంత హానికరమో ఆలోచించాలని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. ఎన్టీఏ నుంచి సకాలంలో చర్యలు ఆశిస్తున్నామన్న ధర్మాసనం.. తదుపరి విచారణను జులై 8న చేపడతామని తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. నీట్–యూజీ (2024) పరీక్ష పవిత్రతకు విఘాతం కలిగిందని వ్యాఖ్యానించింది. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్‌టీఏపైనే ఉందని తెలిపింది. ప్రశ్నపత్రం లీకేజీ, ఇతరత్రా అక్రమాలు జరిగినందున ఈ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లకు సమాధానం ఇవ్వాలని కేంద్రం, ఎన్‌టీఏలను ఆదేశించింది. అయితే, ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేసేందుకు మాత్రం నిరాకరించిన సంగతి తెలిసిందే.

## హ్యాట్రిక్ విజయంతో మరోసారి ప్రధానిని చేశారు

**– గంగామాత దత్తతతీసుకోవడంతో మీలో ఒకడినయ్యా – వారణాసిలో పర్యటించిన మోడీ**

**– రూ.20వేల కోట్ల పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల**

వారణాసి (ప్రజా మంటలు):గంగా మాత తనను దత్తత తీసుకుందని, అందుకే తాను వారణాసివాసుల్లో ఒకరినయ్యానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కాశీ ప్రజలు తనను ఎంపీగా ఎన్నుకోవడమే కాకుండా వరుసగా మూడోసారి ప్రధానిని చేశారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ప్రజాస్వామ్య దేశాల్లో మాత్రమే సాధ్యమన్నారు. 60 ఏళ్ల క్రితం ఇది జరిగిందని, అప్పటి నుంచి ఏ ప్రభుత్వం కూడా ఇప్పుడు సాధించిన హ్యాట్రిక్ సాధించలేదని చెప్పారు. ఎప్పటిలాగే ప్రజల కలలు, ఆంక్షాలను పండిచేందుకు తాను రేయింబవళ్లు పనిచేస్తానని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి వారణాసి ఎంపీగా మోదీ గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలో మంగళవారంనాడు తొలిసారి పర్యటించారు. పీఎం–కిసాన్ పథకం కింద 17వ విడతగా రూ.20,000 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, వికసత్ భారత్‌కు రైతులు, యువత, మహిళా శక్తి, పేదలు నాలుగు కీలక స్తంభాలని, తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులు, పేదలకు సంబంధించిన అంశంపైనే తొలి నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలను ప్రధాని ప్రశంసిస్తూ, 60 ఏళ్లలో ఒక ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలో రావడం ఇదే మొదటిసారని చెప్పారు. ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు పాల్గొన్నారు, ప్రపంచం లోనే అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్న రికార్డు ఇదని చెప్పారు. ఈ సంఖ్య దాదాపు అమెరికా జనాభాతో సమానమని అన్నారు. భారత ప్రజాజ్వామ్యం పటిష్టత యావత్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసిన వారణాసి ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అసాధరణ తీర్పునిచ్చారని కొనియాడారు. ప్రపంచంలోనే భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబడేందుకు వ్యవసాయ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని మోదీ అన్నారు. సదుద్దేశం, పట్టుదల, రైతుల సంక్షేమానికి పాటుపడటం ద్వారా ఇది సుసాధ్యమని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, వ్యవసాయ ఎగుమతుల్లో ఎదురులేని స్థాయికి చేరుకోవాలని అన్నారు. ప్యాకేజీ ఫుడ్ గ్లోబల్ మార్కెట్‌లో ఇండియాను తిరుగులేని స్థాయికి తీసుకువెళ్లాలని, ప్రపంచంలో ప్రతి డైనింగ్ టేబుల్ వద్దకు మన భారతీయ ఫుడ్ ప్రొడక్ట్‌ను తీసుకువెళ్లాలన్నదే తన కల అని చెప్పారు. రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం–కిసాన్ సమ్మాన్‌నిధి' 17వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో విడుదల చేశారు. దీంతో దాదాపు 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2వేలు చొప్పున రూ.20 వేల కోట్లు జమ కానున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారణాసి లో మోదీ పర్యటించడం ఇదే తొలిసారి. నరేంద్ర మోదీ ఈనెల 9వ తేదీన వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు పీఎంవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన.. 'పీఎం కిసాన్' 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపైనే తొలి సంతకం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఈ పథకం అమలు చేస్తోంది. దీనికింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తోంది.



## విద్యుత్ కుంభకోణ సూత్రధారులను శిక్షించాల్సిందే..

తీసుకోకుండా భద్రాద్రి పవర్ ఎ÷–లాంట్ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. యాదాద్రి పవర్ ఎ÷–లాంట్ వల్ల రవాణా చార్జీల భారం పడుతుందని చెప్పారు. ఈ విషయాలన్నీ కమిషన్ కు వివరించినట్టు చెప్పారు.

తప్పులను సమర్థించుకుంటున్న కెసిఆర్

కేసీఆర్ చేసిన తప్పులను సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ లోని బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి కోదండరాంతో పాటు విద్యుత్ శాఖ అధికారి రఘు వచ్చారు. వారిద్దరి నుంచి కమిషన్ వివరాలు అడిగి తెలుసుకుంది. ఛత్తీస్‌గఢ్ తో 2000 మెగావాట్లకు ఒప్పందం చేసుకుంటే 200 మెగావాట్లు కూడా రాలేదని కాంపిటేటివ్ బిడ్డింగ్ కు వెళ్లుంటే రేట్లు తగ్గేవని.. ఎంవోయూ ద్వారా ముందుకెళ్లారని ఇది అనుమానించదగ్గదేనని కోదండరాం కమిషన్‌కు తెలిపినట్లుగా తెలుస్తోంది. ఛత్తీస్ గఢ్ తో కరెంట్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లపై గతంలో అఫిడవిట్ వేశామని కోదండరాం మీడియాకు తెలిపారు. అందుకు సంబంధించిన ఆధారాలను కమిషన్ ముందు ఉంచామన్నారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించాలన్నారు. అభివృద్ధి అంటే ఒకరిద్దరికి లాభం చేయడం కాదన్నారు. గత ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల ట్రాన్స్‌కో, జెన్‌కోలకు రూ.81 వేల కోట్ల అప్పులు అయ్యాయన్నారు. గత ఏడాది వరదలు వస్తే భద్రాద్రి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. భవిష్యత్తులో గోదావరి వద్ద నీటి మట్టం పెరిగితే భద్రాద్రి ఎ÷–లాంటును కాపాడుకోగలమా? అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఆ తప్పిదాలపై క్రిమినల్ చర్యలకు వెనుకాడవద్దని సూచించారు. అందరూ కూడా చట్టం ప్రకారమే నడుచుకోవాలని స్పష్టం చేశారు. మరోవైపు పవర్ కమిషన్ విచారకు సంబంధించి కేసీఆర్ పంపిన లేఖపై పవర్ కమిషన్ చైర్మ సమీక్ష చేపట్టారు. భద్రాద్రి యాదాద్రి థర్మల్ పవర్ ఎ÷–లాంట్ అంశాల్లోని కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారన్న కమిషన్ కేసీఆర్ చెప్పిన విషయాలను నిపుణుల కమిటీతో చర్చిస్తారు. వాస్తవాలపై ప్రతినిధులని కూడా వివరాలు అడుగనున్న కమిషన్ నేడు చర్చ అనంతరం దాని అనుగుణంగానే తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ కమిషన్ తీరుపై కేసీఆర్ ఆగ్రహంగా ఉన్నారు. విచారణ అర్హత లేదంటున్నారు. అయితే జస్టిస్ నరసింహారెడ్డి మాత్రం ఎవరి అభిప్రాయాలు వారు చెప్పే అవకాశం ఉందన్నారు.

## బక్రా నదిపై కుప్పకూలిన బ్రిడ్జి

ఈ ఏడాది మార్చిలోనూ రాష్ట్రంలోని సుపౌల్ జిల్లా కోసి నదిపై నిర్మించిన ఓ వంతెన కూలిపోయింది. ఆ ఘటనలో ఒకరు మృతి చెందగా.. పది మందికిపైగా గాయపడ్డారు.



## స్వామివారిని దర్శించుకున్న కొత్త ఎస్పీ అశోక్ కుమార్

ధర్మపురి జూన్ 18 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా కు నూతనముగా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా నియమితులైన అశోక్ కుమార్ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికిన పిదప వేదపండితులు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్ శ్రీ స్వామివారి శేషవస్త్రం ప్రసాదం చిత్రపటం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముత్యాల శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు అశ్విన్ కుమార్, వంశీకృష్ణ, స్థానిక సిఐ, ధర్మపురి, బుగ్గారం ఎస్సైలు పాల్గొన్నారు.

## ఎన్ఐటీ లో జేఈఈ మెయిన్ అభ్యర్థుల కోసం ఓపెన్ హౌస్

వరంగల్ జూన్ 18 (ప్రజామంటలు):

ఎన్ఐటీ వరంగల్ జేఈఈ మెయిన్ అర్హత సాదించిన అభ్యర్థుల కోసం ఓపెన్ హౌస్‌ను నిర్వహించింది. అసోసియేట్ డీన్, అడ్మిషన్స్ ప్రొఫెసర్ రవి చంద్ర ఆధ్వర్యంలో తల్లిదండ్రులు మరియు అభ్యర్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ ఓరియంటేషన్లో ఎన్ఐటీ వరంగల్‌లో అందిస్తున్న పాఠ్యాంశాలు, సౌకర్యాలు, కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. అభ్యర్థులు బీటెక్‌లోని 11 కోర్సులకు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో 3 కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొ బిద్యధర్ సుబుధి తెలిపారు. ప్రొ శరత్ బాబు, డీన్ అకడమిక్స్ బృందం విద్యార్థులకు సందేహానివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు, హెడ్‌లు, అడ్మిషన్ల బృందం పాల్గొన్నారు.




# ధర్మపురి నరసింహునికి జన్మ నక్షత్ర పూజలు

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

ధర్మపురి జూన్ 18 (ప్రజామంటలు):







ధర్మపురి క్షేత్రస్థ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థా నంలో మంగళ వారం ప్రధానాలయమైన లక్ష్మీ సమేత యోగానంద నరసింహాలయంలో స్వామి జన్మ నక్షత్ర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ప్రాచీన క్షేత్రమై, పలు ప్రత్యేక ప్రాధాన్యతలను సంతరించుకున్న వివిధ దేవాలయాల సముదాయంతో విరాజిల్లుతున్న ధర్మపురి క్షేత్రంలోని ప్రధానాలయాలైన శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నారసింహ ఆలయాలలో నరసింహ జన్మ నక్షత్ర ఉత్సవాన్ని ఘనంగా జరపడం సాంప్రదాయం. "ఉగ్రం వీరం మహా విష్ణుం జ్వలంతం సర్వతో ముఖంబీ నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం" అనే మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది. పగలు రాత్రి కాని సంధ్యా సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవమూ కాని చేతి గోళ్ళతో, హిరణ్యకశిపుని చీల్చి భక్తజన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అవతారాలకు భిన్నమైన అవతారం. 'వృషభే స్వాతి నక్షత్రే చతుర్దశ్యాం శుభదినే, సంధ్యా కాలే నిశాయుక్తే సంభోధ్భూతం నృకేసరి' వైశాఖ శుక్లపక్ష చతుర్దశి స్వాతి నక్షత్ర ప్రదోషకాలంలో నరసింహుడు అవతరించాడు. ముఖ్యంగా నరసింహ జన్మ నక్షత్రం స్వాతి కలిసి వస్తున్న మంగళ వారం ఉదయాత్పూర్వం నుండి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పంచోపనిషత్ యుక్త పూజలు, వేడుకలను నిర్వహించారు. స్వాతి నక్షత్రంను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నారసింహ క్షేత్రములలో నిర్వహించబడు అష్టోత్తరశత శ్రీమహా లక్ష్మీ నృసింహ మహాయజ్ఞం లోక కళ్యాణార్థం, సమస్త విశ్వశాంతి గూర్చి ఈ సంవత్సరం ధర్మపురి క్షేత్రములో అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ సూచనల మేరకు శ్రీమాన్ భాగవతుల వంశీ కృష్ణమాచార్యస్వామి, హైదరాబాద్ ఆధ్వర్యములో నేరేళ్ల శ్రీనివాసాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు, అలాగే నంబి శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకుల పర్యవేక్షణలో అనుబంధ ఆలయమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవముగా నిర్వహించడం జరిగింది. దేవస్థానం ఏసీ ఈఓ శ్రీనివాస్ సంకటాల పర్యవేక్షణలో, అర్చకులు, ఆస్థాన వేదపండితులు బొజ్జ రమేశ్ శర్మ ఆచార్యత్వంలో విశేష కార్యక్రమాలను నిర్వహించగా, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, భాగవతుల వంశీ కృష్ణమాచార్య, ఏసీ ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడి

**15 లీటర్ల నాటు సారా స్వాధీనం, 100 లీటర్ల బెల్లం ధ్వంసం**

**ఐదుగురు మహిళలపై కేసు**



భీమదేవరపల్లి జూన్ 18 (ప్రజామంటలు):

మండలంలోని ముల్కనూర్ వడ్డెర కాలనీలో గుడుంబా స్థావరంపై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడి నిర్వహించారు. 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, 100 కేజీల పులిసిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, కొంతమంది మహిళలు అక్రమ నాటు సారాను, ఊరి చివర కాస్తున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ముందే రాకను పసిగట్టిన ఐదుగురు మహిళలు అక్కడి నుండి పారిపోయినట్లు తెలిపారు. పారిపోయిన మహిళలు రేణుక, బొమ్మిశెట్టి స్వరూప, సరోజన, గొల్లెన లక్ష్మి, కొమురమ్మ అని గుర్తించినట్లు తెలిపారు. వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కోటి, వీరమల్లు, లాలయ్య, ఆయుబ్ లు పాల్గొన్నారు.

## యాదవ సంఘ పట్టణ నూతన అధ్యక్షుడు నక్క లచ్చయ్య

గొల్లపల్లి జూన్ 18 (ప్రజామంటలు):



గొల్లపల్లి మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశం లో యాదవ సంఘం నూతన కమిటీ ని ఎకగ్రీవంగా ఎన్నుకోన్నారు. యాదవ్ సంఘము గ్రామ శాఖ అధ్యక్షులు నక్క లచ్చయ్య, ఉపాధ్యక్షులు కాల్వ మల్లేష్, ప్రధాన కార్యదర్శి కాల్వ చిన్న రాజయ్య, క్యాసియిర్ కాల్వ ఐలయ్య ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు అధ్యక్షులు నక్క లచ్చయ్య మాట్లాడుతూ..... సంఘము బలోపేతం కోసం కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జక్కుల మల్లయ్య, పంబాల మహేందర్, చిన్న గంగన్న, కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ అవగాహన కార్యక్రమం



గొల్లపల్లి జూన్ 18 (ప్రజామంటలు):

గొల్లపల్లి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మండల వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలములో 1 నుండి 19 సంవత్సరముల వయస్సు గల పిల్లలను 10590 మందిని గుర్తించాం. జూన్ 20న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయవలెను. పాఠశాలకు రాని పిల్లలకు జూన్ 27న మాత్రలు వేయవలెను అని అన్నారు.పిల్లలు నిరసముగా, బుద్ధి మాధ్యం, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, అనారోగ్యంతో బాధపడు తుంటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలెనని మల విసర్జన బయట విసర్జించవద్దని వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినవలెనని పరిశుభ్రమైన నీరు తాగవలెనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, ఎంపీడీవో రామ్ రెడ్డి, సిహెచ్ఓ గట్టు శ్రీధర్ సూపర్వైజర్లు నరేందర్, రమేష్ శారద, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆరోగ్యం బాగు పడక బావిలో దూకి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం జూన్ 18 (ప్రజామంటలు):



తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మి (భర్త: ప్రభాకర్ 60 సం.) తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆమె గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్య లతో బాధపడుతున్నది. ఎన్ని ఆస్పత్రులు తిరిగిన తన ఆరోగ్యం బాగుపడకపోయేసరికి జీవితంపై విరక్తి చెంది సోమవారం అనగా జూన్ 17న ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుండి వెళ్లిపోయి తిమ్మాపూర్ గ్రామ శివారులో గల మునిగంటి పెద్ద గంగారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నదని మృతురాలి భర్త మొగిలి ప్రభాకర్ దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఏ. అనిల్ తెలిపారు.

## త్రాగుడుకు బానిసై వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య



ఇబ్రహీంపట్నం జూన్ 18 (ప్రజామంటలు):

బండ లింగాపూర్ గ్రామానికి చెందిన ఓస నర్సయ్య %ం/శీ% నర్సయ్య వయసు 55 సంవత్సరాలు కులం ముదిరాజ్ గ్రామము బండలింగాపూర్ అను అతడు గత 25 సంవత్సరాలుగా త్రాగుడుకు బానిసై ఏ పని పాట లేకుండా తిరిగేవాడు, ఆదివారం రోజున తేదీ 16న బండ లింగాపూర్ గ్రామంలో పెద్దమ్మ బోనాల పండుగ ఉండగా ఆ రోజంతా త్రాగి రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చి, కుటుంబ సభ్యులతో గొడవ పడి, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసి, అర్ధరాత్రి 12 గంటల సమయంలో నేను చచ్చిపోతున్నానని ఇంట్లో నుండి వెళ్లిపోయినాడు తిరిగి ఉదయమైనా ఇంటికి రాకపోయేసరికి చుట్టుప్రక్కల మరియు బంధువుల ఇండ్లలో వెతికిన నర్సయ్య ఆచూకీ దొరకలేదు. మంగళవారం 18న బండలింగాపూర్ గ్రామ శివారులో గల ముద్దుల భాను చందర్ యొక్క వ్యవసాయ బావిలో ఓస నర్సయ్య చనిపోయి కలడు త్రాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతడి భార్య ఓస లక్ష్మీ బండ లింగాపూర్ మృతుని భార్య దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఏ. అనిల్ తెలిపారు.



## కట్కాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

రాయికల్ జూన్ 18 (ప్రజామంటలు):

మండలంలోని కట్కాపూర్ గ్రామానికి చెందిన మహిళలు తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలంటూ మంగళవారం ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత కొన్ని సంవత్సరాలుగా రాయికల్ నుంచి కట్కాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు,మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి కట్కాపూర్ నుండి రాయికల్ బస్సు సౌకర్యం కల్పించాలని లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు సుజాత, భాగ్యలక్ష్మి, సారిక, లావణ్య, జల, లక్ష్మి, భాగ్య, పర్వీనా బేగం, రజిత తదితరులు పాల్గొన్నారు.

## చెప్పినట్లు వింటున్న కడక్‌నాథ్ కోడి

జగిత్యాల రూరల్ (ప్రజామంటలు):





జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి కోళ్ల ఫారం నిర్వహిస్తుండగా అందులో కడక్‌నాథ్ అనే రకం కోడి తన మాటలు చెప్పినట్లు వింటోంది. ముందుకు రమ్మంటే ముందుకు వస్తుంది. వెనుకు వెళ్లమని చెప్పితే వెనుకకు వెళు తుంది. ఈ ఆసక్తి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అన్ని కోళ్లలో ఆ కోడి మాత్రమే తాను చెప్పినట్లు వింటుందని తనతోనే గడుపుతుందని రైతు మల్లారెడ్డి తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com

# విభజనతో అభివృద్ధి వెనక్కి..అప్పుల ముందుకు !

అనకొండలు రాజ్యమేలితే ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనడానికి తెలుగు రాష్ట్రాలను పాలించిన కెసిఆర్, జగన్ అక్రమాలే నిదర్శనం. విభజన వల్ల ప్రజలకు మేలు జరగకపోగా అప్పులను మాత్రం నెత్తిన పెట్టారు. తమ విలాసాల కోసం భవంతులను నిర్మించుకుని, లక్షల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారు. విభజన జరిగిన పదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ రెండు కుటుంబాలు రాచరికం అనుభవిం చాయి. తమ హంగూ ఆర్భాటానికి వేలకోట్లు దుర్వినియోగం చేశాయి. వారికి అధికారంతో పాటు, సకల సుఖాలు దక్కాయి. వెరసి ఓ పదిపన్నెండు లక్షల కోట్లు దుర్వినియోగం కావడమే గాకుండా మోయలేని అప్పులు సమకూరాయి. కానీ ప్రజల జీవితాల్లో సూదిమొనంత కూడా మార్పు రాలేదు. విభజనకు ముందు తరవాత అన్న అధ్యయనం జరగాల్సి ఉంది. తెలంగాణలో కెసిఆర్ నిర్వాకం వల్ల కాళేశ్వరం,సచివాలయం, ప్రగతి భవన్‌ల నిర్మాణాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. ఆయనతో పాటు, వారి అనుయాయుల పొలాలకు నీళ్లు చేరేలా కాళేశ్వరం డిజైన్ చేసుకున్నారు. ఎందరో రైతులను, గ్రామస్థులను తన అవసరాల కోసం రోడ్డున పడేశారు. తన సుఖాల కోసం ప్రగతిభవన్ నిర్మించుకున్నారు. తనకోసం సచివాలయం నిర్మించుకున్నారు. ఎంతో పచ్చదనంతో కొత్తకొత్త భవనాలతో ఉన్న సచివాలయాన్ని నేలమట్టం చేసి, రాచరిక పోకడలను చాటుకున్నారు. మనం కోరుకున్న తెలంగాణ ఇదేనా అన్న చర్చ చేయాలి. ఇలాంటి రాచరిక పోకడలు ఉన్న వారి కారణంగా దేశ సంపద ఎలా దుర్వినియోగం అవుతందో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పాలనను ఉదాహరణగా చూడాలి. కొత్తగా ఉద్యోగాలు రాలేదు. కొత్తగా ఉపాధి రాలేదు. కొత్తగా నీళ్లు రాలేదు. పథకాలన్నీ పందేరం చేసేందుకు ఉపయోగించిన ఘనుడు మన కెసిఆర్. అన్నను మించిన తమ్ముడిలా జగన్ కూడా లక్షల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. రాజధాని లేదు. పోలవరం పూర్తి చేయలేదు. రోడ్లు వేయలేదు. కానీ విలాసవంతమైన భవనాలు నిర్మించు కున్నారు. తనో అపర నిజాంలా వ్యవహరించి ప్యాలెస్‌లు కట్టుకున్నారు. తాజాగా బయటపడ్డ విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వెనుక మరెన్నో విషయాలు దాగున్నాయి. తన పాలనా కాలంలో రుషికొండను తొలిచేశారు. అటువైపు చీమకూడా వెళ్లకుండా కట్టుబాట్లు పెట్టి, ప్యాలెస్ నిర్మించుకున్నారు. మళ్లీ నేనే సిఎం..విశాఖలోనే ప్రమాణం అని ప్రచారం చేసుకున్న జగన్ ఇంతగా అధికార, దుర్వినియోగం, నిధుల దుర్వినియోగం చేసిన తీరు ఆశ్చర్యం కలిగించక మానదు. ఇలాంటి కట్టడాలు ఇంకా ఉన్నాయా..అన్న అనుమానాలు వస్తున్నాయి. రుషికొండ ప్యాలెస్‌కు ఎంత ఖర్చు చేశారు.. దేనికి ఖర్చు చేశారు అనే విషయాలకు సంబంధించి లెక్కలు బయటకు రావాల్సి ఉంది. దీనిపై సిఎం చంద్రబాబు ఇప్పటికే నివేదిక కోరారు. పూర్తి వివరాలు వచ్చిన తరువాత ప్రజల ముందు బహిర్గతం అవుతాయి. రాష్ట్రాన్ని తన ఇష్టం వచ్చినట్లుగా జగన్ పాలించచారు. గంజాయి, అక్రమ మద్యం పెరిగింది. వీటివల్ల నష్టపోయిన కుటుంబాల గోడును ఏనాడూ పట్టించుకోలేదు. తెలుగు రాష్ట్రాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం పెరిగింది. రుషికొండపై రాజమహల్ తరహాలో భవనాలను అత్యంత ఖరీదుగా ప్రత్యేకంగా నిర్మించిన తీరుత ఇప్పుడు ప్రపంచాన్ని నివ్వెర పోయేలా చేస్తోంది. ఏడు భవనాల్లో మూడు ప్రత్యేకంగా జగన్ కుటుంబం కోసమే తీర్చిదిద్దారని చెప్పుకుంటున్నారు. అక్కడ ఈ మూడింటికి మాత్రమే సముద్ర తీరంచూసేలా వ్యూ ఉంది. మిగిలిన వాటికి ఎదురుగా బీచ్‌రోడ్డు, గీతం కాలేజీ కనిపిస్తాయి. జగన్ కుటుంబం కోసం నిర్మించిన భవనాల్లో బాల్కనీలోకి వచ్చినా, బాత్‌రూమ్‌లో నుంచైనా కిటికీల నుంచి సముద్రం కనిపించేలా డిజైన్ చేసుకున్నారు. అలాగే మసాజ్ కోసం ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేసుకున్నారు. దానికి 'స్పా రూమ్' అని పేరు పెట్టుకున్నారు. ఇవన్నీ గ్రౌండ్ ప్లస్ వన్ నిర్మాణాలుగా గుర్తించారు. విజయనగర-1 భవనం జగన్, భారతీల కోసం నిర్మించారు. అందులో నాలుగు పడక గదులు ఉన్నాయి. మిగిలిన రెండు భవనాలు చెరో కుమార్తె కోసం ఉద్దేశించినవని చెప్పుకుంటున్నారు. వాటిలో కూడా నాలుగేసి పడక గదులు, విశాలమైన సమావేశ మందిరాలు ఉన్నాయి. ఈ మూడు భవనాలను, మిగిలిన నాలుగింటికి దూరంగా సముద్రానికి అభిముఖంగా నిర్మించారు. వీటికి ప్రత్యేకంగా పెద్దగేటు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు తప్ప ఇంకెవరికీ అటువైపు ప్రవేశం లేకుండా చేశారు. పిడుగులు పడినా చెక్కు చెదరకుండా ఏర్పాట్లు ఉన్నాయి. వీటిలో బాత్‌రూమ్ టబ్ ఒక్కొక్కటి రూ.26 లక్షలని చెబుతున్నారు. ఇంటర్నేషనల్ బ్రాండ్ టోటో కంపెనీకి చెందిన బాత్‌రూమ్ ఫిటింగ్స్ వినియోగించారు. ఇలాంటివన్నీ పర్యాటకుల కోసమేనా?...అని వైసీపీ నేతలను ప్రశ్నిస్తే... సమాధానం చెప్పకుండా అవి ప్రభుత్వ భవనాలే కదా? అంటున్నారు తప్పితే..అంత ఖర్చు ఎందుకు చేశారో చెప్పడం లేదు. విశాఖలో రుషికొండ రాజభవనాన్ని జగన్ ప్రభుత్వ ఆడంబారాలకు నిదర్శనంగా చూడాలి. ఖర్చును వృథా చేసి అడంబరంగా కట్టుకున్న తీరు రాజరకి పోకడలను గుర్తు చేస్తోంది. తాజాగా. రుషికొండ భవనం ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తీరు చూసి ప్రపంచం ముక్కున వేలేసుకుంది. రుషికొండ భవన నిర్మాణంపై ముందునుంచీ దాగుడుమూతలు సాగాయి. మొదట టూరిజం ప్రాజెక్ట్ అన్నారు. తర్వాత ఫైవ్ స్టార్ హోటల్ అన్నారు. ఆ పైన సీఎం క్యాంప్ ఆఫీస్ అన్నారు. ప్రభుత్వ నిర్మాణమైనా, ప్రైవేట్ నిర్మాణమైనా పఎ÷-లాన్ వివరాలను ఆ కట్టడం దగ్గర ప్రదర్శిస్తారు. సెక్యూరిటీ కారణాల వల్ల అలా చేయలేదని ఇప్పుడు సమర్థించు కోవడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్ బస చేయడానికి ఐ.ఎన్.ఎస్. డేగ, నేవల్ గెస్ట్ హౌస్ వంటి నిర్దిష్ట విడిది ప్రాంతాలు ఉన్నాయి. వి.వి.ఐ.పి.లు ఉండే భవనాలు కావడం వల్ల రుషికొండ మీద ఏం కడుతున్నామో చెప్పలేక పోయామని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనడం హాస్యాస్పదం. సరైన అనుమతులు లేవని ప్రభుత్వమే నిర్మించిన ప్రజా వేదికను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. మరి గ్రీన్ ట్రిబ్యునల్ మొదలు అనేక అభ్యంతరాలున్న రుషికొండ భవనాన్ని ఏం చెయ్యాలన్నా సవాలక్ష ప్రశ్నలు వస్తున్నాయి. నిజంగా ఇదంతా విభజన పాపం వల్ల , నేతలపై కట్టుబాట్లు లేకపోవడం వల్ల జరిగిన దుర్వినియోగంగా చూడాలి. వెరసి ఎపి రెండు రాష్ట్రాలుగా విడిపోయి, నేతల అవినీతి కారణంగా అప్పులకుప్పగా మారింది. దీనిపై నిజంగానే ప్రత్యేకంగా కమిషన్ వేసి విచారణ చేసి, అవినీతికి పాల్పడి, అప్పులు చేసిన నేతలను బోను ఎక్కించాలి. ఇకముందు ఇలాంటి అకృత్యాలకు పాల్పడకుండా చట్టబద్ద చర్యలకు పూనుకోవాలి.

# బెట్టింగ్, సామాజిక మాధ్యమాలకు బానిసలుగా యువత



నేడు యువత సామాజిక మాధ్యమాల బారిన పడి విలువయిన భవిష్యత్ ని సర్వ నాశనం చేసుకుంటూ వున్నారు.కొంత మంది కి క్రికెట్ అంటే పిచ్చి. స్నేహితులతో కలిసి ఐపీఎల్‌లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాత సెల్‌ఫోన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం ప్రారంభించడం జరుగుతుందని ఆరోపణలు విన వస్తూ వున్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు.. తరువాత పందేల్లో రూ.వేల నగదు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం,. నగదు కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూ వున్నారు.అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశం వచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపం చేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ,ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్ ఫోన్‌లను ఎక్కువగా వాడతారు. తల్లిదండ్రులు కొని ఇస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ప్లాట్‌ఫాం, యాప్‌లలో వీడియోలు చూడటం ప్రారంభించడము, నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి . కరోనా లాక్‌డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీ సమయం ఎక్కువగా లభించడంతో యువత ఓటీటీలు, యాప్‌లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిఫ్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతిక విలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తేలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటి చూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడం చాలా ఆందోళనకరం.ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘా పెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు.సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు విద్యార్థులు, యువత పలు రకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగ, ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి.. విద్యార్థులు, యువత బలహీనతలను ఆసరాగా తీసుకొని బెట్టింగ్ తరహా వ్యాపారాలు కొంతమంది చేస్తున్నారని సామాజికవేత్తలు అభిప్రాయము వెలి బుచ్చుతూ వున్నారు. తొమ్మిది గంటల కల్లా పిల్లలని నిద్రపుచ్చి తెల్లవారుజామున ఐదు గంటలకే నిద్ర లేపి ధ్యానం, యోగా సాధన చేయించాలి.యువత సెల్ ఫోన్ కి దూరంగా వుండి మితం గా వాడాలి.అనారోగ్య సమస్యలకు దూరంగా వుండాలి.

**కామిడి సతీష్ రెడ్డి**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**9848445134.**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

## కవిత్వం

### స్వర్ణాంధ్ర సృష్టికర్త శ్రీ చంద్రబాబు... పట్టాభిషేకం..!

నారా చంద్రబాబు నాయుడు...
అనే నేను...
శాసనం ద్వారా
నిర్మితమైనజి
భారత రాజ్యాంగం పట్ల...
నిజమైన విశ్వాసం
విధేయత చూపుతానని...
భారతదేశ
సార్వభౌమాధికారాన్ని...
సమగ్రతను కాపాడుతానని...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా
నా కర్తవ్యాలను శ్రద్ధతో...
అంతఃకరణ శుద్ధితో...
నిర్వహిస్తానని...
భయం కానీ...
పక్షపాతం కానీ...
రాగద్వేషాలు కానీ...లేకుండా
రాజ్యాంగాన్ని శాసనాలను
అనుసరించి...
ప్రజలందరికీ న్యాయం
చేకూర్చుతానని... దైవసాక్షిగా
ప్రమాణం చేస్తున్నాను అంటూ

స్వర్ణాంధ్ర ప్రదేశ్ సృష్టికర్త
శ్రీ నారా చంద్రబాబు
నాయుడు గారు
విచ్చేసిన అతిరథ మహారథుల
సమక్షంలో
ప్రమాణ స్వీకారం చేసి
నాలుగోసారి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా
అధికారపీఠాన్ని అధిరోహించిన
శుభవేళ

అంగరంగ వైభవంగా జరిగిన
ప్రమాణస్వీకార
మహోత్సవానికి ...
వేదికనలంకరించిన
ఆహ్వానితుల్లో
ప్రత్యేక ఆకర్షణ...హ్యాట్రిక్ కొట్టిన
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ
గారే...

నదులన్నీ సముద్రంలో
కలుస్తాయన్నది నానుడి...కానీ
సముద్రమే వచ్చి నదుల్లో కలిసిన
రీతిగా...

ఒక జాతీయ పార్టీనేత...
సాక్షాత్తూ ఒక దేశ ప్రధాని
ఒక ప్రాంతీయ పార్టీనేత...
శ్రీ నారా చంద్రబాబు
నాయుడు గారి
ప్రమాణస్వీకారానికి అతిథిగా
రావడం ఆంధ్రరాష్ట్రానికి దక్కిన
అరుదైన గౌరవం
ఇక ప్రేమతో ప్రధానిమోడీ
రాష్ట్రానికి
ప్రసాదించాలి ప్రత్యేకహోదా
వరం...

ఇది వ్యూహకర్త...
అపర చాణక్యుడు...
పరిపాలనాదక్షుడు...
రాజకీయ దురంధరుడు...
శ్రీ నారా చంద్రబాబు...
నాయుడి గారి సారథ్యంతోనే
సాధ్యం...

పోలయ్య
కూకట్లపల్లి...హైదరాబాద్

# తెలుగు భాషకు "వేదం" ఎనలేని సేవ



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

## జూన్ 18...వేదం వెంకట రాయ శాస్త్రి వర్ధంతి

పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరి కత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపా యి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మిన హాయిం పు ఏమీ లేకుండే. ఆ సంధి కాలం లో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్ర వ్మాయమున క్రొత్త యుగానికి సూచిక అయింది.

వేదం వెంకట రాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయన చూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయములలో శాస్త్రి చూపిన మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం.


సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి...వేంకట రమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్థ వంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతం లలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు.

పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించే వారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు.1916లో సూర్యారాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు.

అముక్త మాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు.

ఆముక్త మాల్యద వ్యాఖ్య శతాధిక వసంతాలను చూసింది. 24-6-1920 నాడు ప్రారంభించి 20-10-1920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు.

ఆముక్తమాల్యద - సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్రము, శ్రీకృష్ణ దేవరాయ, విజయము-నాటకము, కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వ్మాయ చరిత్ర - ప్రథమ సంపుటం, చరిత్ర రచన - ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము, వ్యామోహము తదితరాలు అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము - చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణీయము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనము, తానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం,
రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు.




1920లో ఆంధ్ర మహా సభ చేత 'మహోపాధ్యాయ' బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత 'సర్వ తంత్ర స్వతంత్ర', 'మహా మహోపాధ్యాయ', 'విద్యా దాన వ్రత మహోదధి' అనే సత్కారాలు పొందారు.1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చేత 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సన్మానించ బడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి' బహుమతి లభించింది. వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు.

# పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలి

**స్మార్ట్ సిటీ నగరంలో ఇప్పటికీ రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరం**

**మల్యాల సుజిత్ కుమార్, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు**



కరీంనగర్ (ప్రజామంటలు): కరీంనగర్ నగర పరిధిలో ఎమ్మెల్యే, మేయర్, ఎంపీ లు నగరపాలక సంస్థ అట్టహాసంగా ప్రారంభించిన కేబుల్ బ్రిడ్జి/తీగెల వంతెన కొద్ది నెలలకే పలుమార్లు రిపేర్ కి రావడం, దానికి వాళ్ళు పెట్టిన ఖర్చు దాదాపు రెండువందల కోట్ల రూపాయల ప్రజా ధనం అని తెలియడం చాలా బాధ కలిగించే అంశం. అదేదో ప్రపంచ వింత లాగా, లక్షల మందికి లబ్ది చేకూర్చేదిగా ఆ బ్రిడ్జి ప్రారంభం అప్పుడు కోట్ల రూపాయల ఖర్చుతో డాన్స్ షోలు పెట్టి ఎమ్మెల్యే, మేయర్ ప్రజలని మభ్యపెట్టారు కానీ తరువాత బ్రిడ్జి నాణ్యత లోపం పదే పదే బయటపడుతోంది. ఇక నగర నడిబొడ్డున సవరన్ స్ట్రీట్ లో దశాబ్దాలుగా కొలువుతీరిన నెహ్రూ చౌక్ లో పూజ్య పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి విగ్రహాన్ని తొలగించిన నగరపాలక సంస్థ నాలుగేళ్లుగా ఆయన విగ్రహాన్ని తిరిగి స్థాపించడం లేదు. ఈ మేయర్ రాజకీయాల్లో ఎదిగిందే నెహ్రూ గారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీలో, కానీ మేయర్ ఎమ్మెల్యే లు బీజేపీ ఎంపీ కి భయపడో లేక ఆ విగ్రహానికి అయ్యే బడ్జెట్ చాలా తక్కువ అనో ఆ మహానేత దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి విగ్రహాన్ని పునః ప్రతిష్టించడం లేదు. ఎన్నో మార్లు నగరపాలక సంస్థ కమిషనర్ గారిని ఈ విషయంలో కలిసినా ప్రయోజనం కనిపించలేదని సుజిత్ కుమార్ తెలిపారు. కేబుల్ బ్రిడ్జి ఖర్చు, నాణ్యత, నెహ్రూ గారి విగ్రహ స్థాపన పై గట్టి చర్చ జరగాల్సిందేనని అన్నారు. గత దశాబ్ది కాలంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్లో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ శానిటేషన్ జవాన్లను ఇప్పటివరకు బదిలీలు చేపట్టకుండా గత ప్రభుత్వం లోని పాలకవర్గం వారికి అనుకూలంగా విధులు చేపట్టేలా చూసుకోవడం జరిగింది. ఉద్దేశపూర్వకంగానే కొన్ని డివిజన్లో మంచినీటి సరఫరా రోడ్ల నిర్మాణం డ్రైనేజీల నిర్మాణం పై నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహించడం జరిగిందని దినపత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం తెలియజేసినప్పటికీ వాటి పరిష్కారం కోసం పాలకవర్గ సభ్యులు అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు. సమాజానికి తెలియజేయవలసిన అవసరం ఉందని కోరుతున్నాను.

## గృహజ్యోతి పథకం అందని దాదాపు వంద మంది పేదలకు వెంటనే అమలు చేయాలి

**బిజెపి నాయకులు పోలోజు సంతోష్**



చిగురుమామిడి (ప్రజామంటలు):

చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో 6 గ్యారెంటీలకు అప్లై చేసుకున్న కూడా అధికారులు నిర్లక్ష్యం వలన దాదాపు 100 కుటుంబాల దరఖాస్తులను ఆన్లైన్ చేయకపోవడం వలన ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకం అమలు కాకపోవడంతో గత మూడు నెలలుగా అర్హులైన పేదలు కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక మంత్రి ఈ సమస్య పైన ప్రత్యేక దృష్టి పెట్టిన వెంటనే అధికారులతో ముదిమానిక్యం గ్రామంలో పూర్తిస్థాయి సర్వే చేసి అర్హులకు ఎంతమందికి రావడం లేదో వారందరికీ కూడా గృహ జ్యోతి పథకం అమలు అదేవిధంగా చర్యలు తీసుకోవాలని గత మూడు నెలలుగా వారు చెల్లించినకరెంటు బిల్లులను తిరిగి వారికి ఇప్పించాలని మరియు రాబోవు కాలంలో ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు అందేవిధంగా చూడాలని భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాలని లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తామని తెలియజేశారు.

## ఎంఆర్ పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం**

**జూన్ 17న జమ్మికుంటలో సన్నాహక సమావేశం**

**ముఖ్యఅతిథిగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్**

**వివిధ ప్రాంతాల నుంచి హాజరైన ప్రముఖ కవులు, కళాకారులు**



జమ్మికుంట (ప్రజామంటలు):

మాదిగల చైతన్యం కోసం, ఏబిసిడి వర్గీకరణ కోసం 1994 లో ఆవిర్భవించిన దండోరా (ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించి, 30 ఏళ్లు వస్తున్న సందర్భంగా జూలై 7న వరంగల్లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వచ్చే నెల జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సన్నాహక జమ్మికుంట లోని ఒక ప్రైవేట్ గెస్ట్ హౌస్ లో నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశం జరిగేపార్టీలకు అతీతంగా, మాదిగల ఆత్మగౌరవం కోసం మాదిగలు మరియు మాదిగ ఉపకులాలు ఆవిర్భావ వేడుకలకు సమాయత్తం కావాలని అన్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా విడుదల చేస్తున్న పాటలకు, పుస్తకాల ముద్రణకు తనవంతుగా సహకారం అందిస్తానని అన్నారు. ఏబిసిడి వర్గీకరణ అంశంలో మందకృష్ణన్న చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. పార్టీలకతీతంగా మాదిగలు, మాదిగ ఉప కులాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం సీనియర్ నాయకుడు నలిగంటి శరత్ మాట్లాడుతూ మాదిగ జాతికి మనందరం వారసులం కనుక ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆహ్వానం పలికారు. కవిత్వం, పాటలు, వ్యాసాలు సమీకరించి పుస్తక రూపంలో అందించబోతున్నామని అన్నారు. రచయితలు తమ రచనలు ఈనెల 25 లోగా పంపించాలని కోరారు. సీనియర్ కళాకారుడు రామంచ భరత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ కవులు, కళాకారులు ముక్కెర సంపత్ కుమార్, డా. కట్కూరి మహేందర్, అశోక్ మోరే, గిద్దె రాంనర్సయ్య, అంబాల మధునయ్య, గోల్కొండ బుచ్చన్న, పుల్లూరు సమ్మయ్య (సమర్), జూపాక శివ, కన్నూరి ఆనంద్, కేతపాక ప్రసాద్, సీనియర్ దళిత సంఘాల నాయకుడు ఇమ్మడి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ఇల్లందకుంట (ప్రజామంటలు):

మల్యాల లో వి107ఎ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశానుసారం ఉదయాస్తమాన సేవలు డాన్ టు డస్క్ లో భాగంగా 7 సేవా కార్యక్రమలు వాసవి క్లబ్ ఇల్లందకుంట వారు ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇల్లందకుంట అధ్యక్షులు విఎన్ గుండా కేదారి గారు మాట్లాడుతూ మల్యాల ప్రాథమిక పాఠశాలలో మంచి నీటి కోసం వాటర్ ట్యాంకు పిల్లల సౌకర్యార్థం పెన్నులు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. మరియు వీది వ్యాపారులకు గొడుగులు, దేవాలయంలో కూర్చోవడానికి రెండు స్టూల్స్ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ప్రజల అవసరాలను తీర్చే కానిస్టేబుల్స్ ను సన్మానించారు. అదేవిధంగా అవయవ దాన పత్రాల మీద సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ విఎన్ ప్లాటినం కెసిజిఎఫ్ 5 మాడా సుబ్బారావు మరియు ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విఎన్ కెసిజిఎఫ్ అల్లంకి లచ్చయ్య రీజినల్ చైర్ పర్సన్ విఎన్ కెసిజిఎఫ్ గంప సురేందర్ గారు రీజినల్ సెక్రటరీ విఎన్ కెసిజిఎఫ్ గందే ప్రవీణ్ జోనల్ చైర్ పర్సన్ విఎన్ఎల్ 4 కెసిజిఎఫ్ అయిత రమాదేవి, అధ్యక్షులు విఎన్ గుండా కేదారి, కార్యదర్శి విఎన్ దేవునూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి వి ఎన్ ఆర్ కైలాసం మరియు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ మెంబర్ గా వనగుంది విజయలక్ష్మి నియామకం





గుంతకల్ (ప్రజామంటలు):

బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వన గొంది విజయలక్ష్మి కి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీ మెంబర్ గా నామినేటెడ్ పోస్ట్ కు ఎంపికైన సందర్భంగా గుంతకల్ బిజెపి పార్టీ నాయకులు కలిసి వనగుంది విజయలక్ష్మి కి పూలమాలవేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.... పార్టీ లో నిబద్ధతగా ఉండి.. విజయలక్ష్మి పార్టీకి చేసిన సేవలకు ప్రతిఫలంగా బిజెపి పార్టీ గుర్తించి సముచిత స్థానం కలిపించడము చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ అసెంబ్లీ కన్వీనర్ బందారు కృష్ణమూర్తి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుర్రం సూర్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేష్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జరాట్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కళావతి, బిజెపి సీనియర్ నాయకురాలు విజయదుర్గమ్మ, లక్ష్మీ, వందన, జ్యోతి తదితరులు పాల్గొని విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు.



**గాంధీ మెడికల్ స్టూడెంట్స్‌కు**

## కొత్త హాస్టల్ భవనాలు

**ఖాళీ స్థలాలను పరిశీలించిన ఉన్నతాధికారులు**

**హెల్త్ సెక్రటరీ క్రిస్టినా గాంధీ మెడికల్ కాలేజీ విజిట్**

సికింద్రాబాద్ జూన్ 18 (ప్రజామంటలు):

నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్.ఎమ్.సీ) తాజా నిబంధనాల ప్రకారం కనీసం 75 శాతం మెడికల్ స్టూడెంట్స్ కు వసతి భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. మెడికల్ స్టూడెంట్స్ కోసం నూతన హాస్టల్ భవనాలను నిర్మించడానికి అవసరమైన స్థలాలను పరిశీలించేందుకు మంగళవారం స్టేట్ మెడికల్, హెల్త్, ఫ్యామిలీ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ గాంధీ మెడికల్ కాలేజీ ని అధికారులతో కలసి సందర్శించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.ఎన్.వాణీ, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కే. రమేశ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డా. కృష్ణమోహన్, డా. రవీంద్రకుమార్, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు లతో కలసి కాలేజీ ఆవరణలోని అకాడమిక్ భవనం, ఫైర్ స్టేషన్, అలుమ్ని భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.రమేశ్ రెడ్డి మాట్లాడుతూ.... నేషనల్ మెడికల్ కౌన్సిల్ తాజా నిబంధనాల ప్రకారం 75 శాతం మెడికోలకు తప్పనిసరిగా హాస్టల్ వసతి కల్పించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం గాంధీలో 50 శాతం మంది మెడికల్ స్టూడెంట్స్ కు మాత్రమే హాస్టల్ వసతి ఉందని, కొత్త హాస్టల్ భవనాల నిర్మాణాలతో మరో 30 శాతం విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం ఉందన్నారు. ఇటీవల పలువురు స్టూడెంట్స్ తమకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో హాస్టల్ వసతి సరిపోవడం లేదని హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహా ను కలసి విజ్ఞప్తి చేశారన్నారు. టీజీఎమ్ఎస్ఐడీసీ సీఈ దేవేందర్ కుమార్, ఎస్.ఈ. సురేందర్ రెడ్డి, ఈఈ చలపతిరావు, డిప్యూటీ ఈఈ అనిల్ కుమార్, ఎంపీహెచ్ఈవో మొగరాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్లకు టి.టి.డి. శుభ వార్త

**ఇంతకాలం నరకయాతన అనుభవించిన సీనియర్ సిటిజన్స్ కి గుడ్ న్యూస్ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం**




తిరుమల తిరుపతి జూన్ 18 (ప్రజామంటలు):

ఆన్ లైన్ విదానం వృద్ధులు అందరికీ తెలియక ముప్పతిప్పలు పడుతూ కలియుగ దైవదర్శనం నోచుకొక ఇంతకాలం వృద్దుల నరకయాతన పడ్డారు. వారందరికీ గుడ్ న్యూస్ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం. దర్శనం కోసం క్యూ కాంప్లెక్స్ లోపలకు వెల్లిన భక్తులకు గత ప్రభుత్వం దూరం చేసి సంస్కృతి సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చిన స్థానంలో భక్తుల కోసం వాటిని పునరుద్ధరణ చేసిన టీటీడీ.

**సీనియర్ సిటిజన్లకు టి.టి.డి. శుభవార్త**

వేంకటేశ్వరుని ఉచిత దర్శనం సీనియర్ సిటిజన్‌ల కోసం రెండు స్లాట్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఒకటి ఉదయం 10 గంటలకు,మరొకటి మధ్యాహ్నం 3 గంటలకు. మీరు ఫోటో ఐ.డి. తో వయస్సు రుజువును సమర్పించాలి మరియు ఎస్.1 కౌంటర్‌లో సమర్పించాలి.

వంతెన కింద గ్యాలరీ నుండి ఆలయం కుడి వైపు గోడకు రోడ్డు దాటుతుంది. ఏ మెట్లు ఎక్కాల్సిన అవసరం లేదు. మంచి సీటింగ్ ఏర్పాటు అందుబాటులో ఉంది. మీరు లోపల కూర్చున్నప్పుడు వేడి సాంబార్ అన్నం మరియు పెరుగు అన్నం మరియు వేడి పాలు అందించ బడతాయి. ప్రతిదీ ఉచితం. మీరు రూ. 20 చెల్లించి రెండు లడ్డూలను పొందుతారు. మరిన్ని లడ్డూల కోసం మీరు రూ. 25 ప్రతి లడ్డూకి చెల్లించాలి.. టెంపుల్ ఎగ్జిట్ గేట్ వద్ద ఉన్న కార్ పార్కింగ్ ప్రాంతం నుండి, కౌంటర్ కౌంటర్ వద్ద మిమ్మల్ని డ్రాప్ చేయడానికి బ్యాటరీ కారు అందుబాటులో ఉంది. దర్శనం సమయంలో అన్ని ఇతర క్యూలు నిలిపివేయబడతాయి, ఎటువంటి ఒత్తిడి లేకుండా కేవలం సీనియర్ సిటిజన్ దర్శనం మాత్రమే అనుమతించ బడుతుంది. భగవంతుని దర్శనం తర్వాత మీరు 30 నిమిషాల్లోపు దర్శనం నుండి బయటకు రావచ్చు. హెల్ప్ డెస్క్ తిరుమల 08772277777 ని సంప్రదించండి.

## ఎల్కతుర్తిలో "ప్రతి సోమవారం" విద్యుత్ ప్రజావాణి

ఎల్కతుర్తి (ప్రజామంటలు):

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ హన్మకొండ సర్కిల్, హన్మకొండ రూరల్ డివిజన్ పరిధిలోని ఎల్కతుర్తి సెక్షన్ కార్యాలయంలో నేడు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంస్థ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ వినియోగదారులందరికి ఇంతటి బృహత్కరమైన కార్యక్రమాన్ని చేపట్టినందుకు సీఎండీ ని వినియోగదారులు అభినందించారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోగలరని కోరారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కొరకు టీజీ ఎన్పీడీసీఎల్ 16 సర్కిళ్ల పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో అనగా సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు . డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో "ప్రతి సోమవారం" ఉదయం 10:00 గంటల నుండి ఒంటి గంట వరకు మరియు సర్కిల్ ఆఫీస్ లో అదే రోజు సమయం మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులకు మరింత చేరువలో ఉద్యోగస్తులు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కార వేదికగా "విద్యుత్ ప్రజావాణి" అవుతుందని సీఎండీ పేర్కొన్నారు. సీఎండీ వెంట హన్మకొండ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ కె. వెంకటరమణ, డి.ఈ. (టెక్నికల్ ), కె. అనిల్ కుమార్, ఏడిఈ పైడయ్య, ఏఈ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# రెడ్డి సంఘం అధ్యక్షుడిగా దాసరి సాగర్ రెడ్డి

## ప్రధాన కార్యదర్శిగా తాటికొండ సందీప్ రెడ్డి ఎన్నిక



చిగురుమామిడి (ప్రజామంటలు): చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో సోమవారం శ్రీ వినాయక రెడ్డి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షుడిగా దాసరి సాగర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వర్ణ సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ సంపత్ రెడ్డి కోశాధికారి చాడ అనిల్ రెడ్డి లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రొంటాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు దాససరి సాగర్ రెడ్డి మాట్లాడుతూ.... నా మీద నమ్మకంతో నన్ను రెడ్డి సంఘం అధ్యక్షుడిగా గెలిపించినందుకు, రెడ్డి సంఘం కుల బాంధవులకు యువకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. రెడ్డి సంఘం అభివృద్ధికి , కృషి చేస్తానని, తెలిపారు. రెడ్డి సంఘం ఉపాధ్యక్షుడిగా వర్ణ సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ సంపత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పార్వాటి రవీందర్ రెడ్డి, గౌరవ సభ్యులు కేతిరెడ్డి కొండల్ రెడ్డి, దాసరి వెంకట్ రెడ్డి, కాంతాల మాధవరెడ్డి, పోరాండ్ల సంపత్ రెడ్డి, కాంతాల లక్ష్మారెడ్డి, బిల్లా చంద్రారెడ్డి, రొంటాల సూర్య ప్రకాష్ రెడ్డి, సభ్యులు రొంటాల ఉమామహేశ్వర్ రెడ్డి, అరుణ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు.

# జగిత్యాల జిల్లాలో విద్యుత్ ప్రజావాణి ప్రారంభం

## జి. సత్యనారాయణ, ఎస్ఈ



జగిత్యాల(ప్రజామంటలు): టీజీ ఎన్ పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని 35 సెక్షన్ ఆఫీసులలో, 9 సబ్ డివిజన్ ఆఫీసులలో, 5 అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసులలో, జగిత్యాల, మెట్పల్లి డివిజన్ ఆఫిస్ లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఈ రోజు ఉదయం 10:00 గంటల నుండి 1:00 గంటల వరకు మరియు జగిత్యాల జిల్లా సర్కిల్ ఆఫీస్ లో, మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి ప్రారంభించినామని, జి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఇంజనీర్, తెలిపారు. నేటి విద్యుత్ ప్రజావాణి లో విద్యుత్ వినియోగదారులు వచ్చి, వారికి ఉన్న వివిధ సమస్యలు, దగ్గరలో గల పైన తెలిపిన ఆఫీసులలో, విద్యుత్ ప్రజావాణి ద్వారా జిల్లా వ్యాప్తంగా 14 అర్జీలు రాగా, వాటిని పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని జి. సత్యనారాయణ, ఎస్ ఈ, జగిత్యాల తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగదారులు ప్రతి సోమవారం పై ఆఫీస్ లలో జరిగే విద్యుత్ ప్రజావాణి ద్వారా తమ సమస్యలు సమర్పించి, పరిష్కరించుకోవాలని, ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# ఆర్థిక సహాయం అందజేసిన మున్నూరు కాపు సంఘం



గొల్లపల్లి (ప్రజామంటలు): గొల్లపెల్లి మండలము లోని మల్లన్నపేట గ్రామానికి చెందిన మున్నూరు కాపు నిరుపేద కుటుంబం లక్కాకుల మల్లేష్ ఉపాధి నిమిత్తం ముంబై లో ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో భార్య జమున ఇద్దరు చిన్న పిల్లలు పాప, బాబు కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. వీరి కుటుంబ పరిస్థితి కుల సంఘం నాయకులు భీమా సంతోష్, ఆనంతుల మహేష్, ద్వారా మున్నూరు కాపు జిల్లా సంఘం తెలియచేయగా స్పందించిన కుల బంధావులు పెద్ద మనసుతో కొంత డబ్బులు సమకూర్చగా సేకరించిన డబ్బులు జగిత్యాల మున్నూరు కాపు జిల్లా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి కొంత అండగా నిలిచే విదంగా రూ. 20,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ.... పిల్లల భవిషత్తు రీత్యా వారి విద్యాబ్యాసం కుటుంబానికి అన్ని విధాలుగా మున్నూరు కాపు జిల్లా సంఘం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రాచకొండ శ్రీరాములు, బండారి విజయ్, లైశెట్టి వెంకన్న, చిట్ల అంజన్న, కొలగాని మధుసుదన్, జున్ను రాజేందర్, మున్నూరు కాపు గ్రామ అధ్యక్షుడు అవారి లచ్చన్న, సిద్దెంకి మల్లారెడ్డి, అనంతుల మహేష్, లక్కాకుల రాజమల్లు, మున్నూరు కాపు నాయకులు పాల్గొన్నారు.





## వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం కళ్యాణోత్సవంలో పాల్గొన్న డా. బోగ శ్రావణి ప్రవీణ్

సారంగాపూర్ (ప్రజామంటలు): సారంగాపూర్ మండలము అర్పపల్లి గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ప్రథమ వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి.ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండల అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజం, బీజేవైఎం మండల అధ్యక్షులు దిటి వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి, దూలూరి వంశీ, కుడుకుల గంగాధర్, గొల్లపల్లి రాము మరియు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మరియు ఆలయ కమిటీ సభ్యులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## కోల శారద స్మారకార్థం క్రికెట్ పోటీలు


గొల్లపల్లి (ప్రజామంటలు): గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామంలో ఇటీవల కోలశారద మరణించగా ఆమె స్మారకార్థం రాపల్లి గ్రామంలో నేటి నుండి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రాపల్లె గ్రామ మాజీ సర్పంచ్ నల్లా శ్యాం, తంగెళ్ళ సత్యయ్య, వీరబత్తిని గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వస్తున్నమని తెలిపారు. ఈ పోటీలకు వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో క్రికెట్ టీం లు పాల్గొనాలి అని కోరారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 10016 రెండవ బహుమతి 5016 చొప్పున అందిస్తామని తెలిపారు. ఈ క్రికెట్ టవర్నమెంట్ పోటీల ఆర్గనైనర్స్ నల్లా కెఫా, బబ్లు రావు, వినయ్ ల పర్యవేక్షణలో నిర్వహించ బడుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రాపల్లి గ్రామస్తులు, వివిధ గ్రామాల, యువకులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి అని కోరారు.

# బీసీ లోన్ లు ఏమాయ్యాయో కౌశిక్ రెడ్డి చెప్పాలి

## దేశిని కోటి డిమాండ్



జమ్మికుంట (ప్రజామంటలు): జమ్మికుంట వినాయక గార్డెన్ లో విలేకరుల సమావేశంలో దేశిని కోటి మాట్లాడుతూ.... హుజురాబాద్ నియోజకవర్గం లో ఎమ్మెల్యే ఎలక్షన్ల ముందు కులవృత్తుల వారికి బీసీ లోన్లు లక్ష రూపాయల కోసమై ఈ ప్రాంత ప్రజలు బీసీ కుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకొని తాసిల్దారు ఆఫీస్ చుట్టూ వాళ్ల పనులు మానేసి తిరిగి రెండు మూడు వేల రూపాయల ఖర్చు పెట్టుకుని బీసీ సర్టిఫికేట్ తీసుకొని బీసీ లోన్ ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కౌశిక్ రెడ్డి చాలామందికి ఎలక్షన్ల ముందు అందరికీ బీసీ లోన్లు మంజూరు అయ్యాయని, చెక్కులు వచ్చాయని నా వద్దే ఉన్నాయని కౌశిక్ రెడ్డి చెప్పడం జరిగిందని కోటి అన్నారు. నియోజకవర్గంలో బీసీ లోన్లు ఎంతమందికి వచ్చాయో,ఏ గ్రామానికి ఎన్ని చెక్కులు పంచారో కౌశిక్ రెడ్డి చెప్పాలని, బీసీ లోన్లు మొత్తం ఏం చేశారో బహిరంగపరచాలని కౌశిక్ రెడ్డి ని డిమాండ్ చేశారు.. హుజరాబాద్ నియోజకవర్గంలో బీసీ బిడ్డలందరూ ఏ గ్రామానికి ఎన్ని బీసీ లోను మంజూరు అయ్యాయో కౌశిక్ రెడ్డి చెప్పేదాకా నిలదీయాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.



ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సమిద్దీన్





## సఖి అవగాహనా కార్యక్రమము

కేశవపురం విలేజ్ , ఎల్కతుర్తి

మండలం వివో సభ్యులు సమక్షంలో సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది పాల్గొనడం జరిగింది సఖి యొక్క ముఖ్య ఉద్దేశాలు మరియు అందించిన సేవలను తెలియజేయుటకు సఖి సెంటర్ Legal counselor Sridevi madam గారు కేస్ వర్కర్ అయినటువంటి హరిత గారు పాల్గొని సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు మరియు అందించిన సేవలను వివరించడం జరిగింది ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ sarvodaya యూత్ ఆర్గనైజేషన్ మరియు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది కౌన్సిలింగ్ సహాయం వైద్య సహాయం సహాయం పోలీస్ సహాయం తాత్కాలిక వసతి న్యాయ సహాయం ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన ఉండాలని చెప్పడం జరిగింది సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు తెలుపుతూ గృహ హింస లైంగిక వేధింపులు పనిచేసేచోట వేధింపులు అత్యాచారాలు ఇలాంటి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని చెప్పడం జరిగింది సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తామని సమస్య ఉన్నప్పుడు 181 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం రక్షణ లభిస్తుందని అదేవిధంగ 08702452112 అనే నెంబర్ కి కాల్ చేయడం ద్వారా సహాయం బాధిత మహిళలకు సహాయం అందించ బడుతుంది అని చెప్పడం జరిగింది.

# జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ కుమార్ ఐపీఎస్

## 2019 ఐపిఎస్ బ్యాచ్ కు చెందిన అధికారి

జగిత్యాల జూన్ 18 (ప్రజామంటలు)

జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ కుమార్ ఐపీఎస్ తెలియజేసారు.రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్పీగా గానియమించబడిన అశోక్ కుమార్ ఐపీఎస్ మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ నుండి బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు ఎస్పి ని మర్యాదపూర్వకంగా కలుసుకోని పుష్పాగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..... జిల్లా పరిధిలోని సామ్యాసుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా, విద్వేషాలను రెచ్చగోట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేసారు.



# ఘనంగా బక్రీద్ వేడుకలు

రామ కిష్టయ్య సంగన భట్ల



ధర్మపురి (ప్రజామంటలు): ప్రాచీన సనాతన సాంప్రదాయాలకు నిలయమైన, ధర్మపురి క్షేత్రంలో సోమవారం ఈద్ ఉల్ జుహా (బక్రీద్) వేడుకలు ఘనంగా, వైభవోపేతంగా జరిగాయి. పవిత్ర బక్రీద్ పండగ సందర్భంగా, ముస్లిం సోదరులు ప్రాచీన సాంప్రదాయ రీతిలో వేడుకలను జరుపుకున్నారు. ధర్మపురి క్షేత్రంలోని ఈద్ గాహ్, ఇబ్రహీం మసీదు వద్ద వేరువేరుగా వందలాది సంఖ్యలో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మస్జీద్ లలో ఈద్గాలో మత పెద్దల అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

దోరకాల్ ఈదుజ్జ్ చాట్ చే తక్బీర్ సహిత ప్రార్ధనలు భక్తి శ్రద్ధలతో గావించారు. ఒక మార్గం గుండా వెళ్ళి మరోమార్గం గుండా తక్బీర్ అలా ఉచ్చరిస్తూ, సంప్రదాయాచరణ గావించారు. మత పెద్దలు ఇమాం త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ సంబంధిత ప్రాచీన వివరించారు. హజ్రత్ ఇబ్రహీం జ్ఞాపకార్ధం ఖుర్బానీ ఇచ్చే ఆధారాన్ని పాటించారు. ఖుర్బానీని మూడు భాగాలుగా చేసి ఇంటి వారు, బంధువులు ఆరగించడంతో పాటు పేదలకు పంచి పెట్టారు. మహమ్మదీయులకు పవిత్ర దినమైన బక్రీద్ పండగ నాడు ముస్లిం సోదరులంతా ఆనందోత్సాహాల మధ్య పరస్పర శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అలాగే ముస్లిం మహిళలు ఆచారం ప్రకారం ఇతరుల ఇళ్ళకు వెళ్ళి, తోటి మహిళలకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈద్ గాహ్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్య అలంకృతులై, రుచికరమైన ప్రత్యేక వంటకాలు తయారు చేసి మిత్రులను, బంధువులు, ఇండ్లకు ఆహ్వానించి విందులార గింప చేశారు. ఆనందోత్సాహాల మధ్య హిందూ, ముస్లిం సోదరులంతా పరస్పరం పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నిర్జల ఏకాదశి పూజలు:

ధర్మపురి క్షేత్రస్థ శ్రీ లక్ష్మీ నర సింహస్వామి వారి దేవస్థానంలో అన్ని దేవాలయాలలో, సోమ వారం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినం యుత అభిషేకం, అవధారయ పూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, ఆస్థాన వేద వేదపండితులు రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, నేరెళ్ళ శ్రీనివాసాచార్య, రమణాచార్య, నరసింహమూర్తి, వంశీ కృష్ణ, అరుణ్, కిరణ్, అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించిన భక్తులు, స్థానికులు, దైవ దర్శనాలు చేసుకున్నారు.ఇ